


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 24-10-2026 | సంపుటి - 31 | సంచిక - 150 | రూ : 4 | పేజీలు: 8

మరో రెండు విడతలకూ
భూములు సిద్ధం చేయాలి

- ఇందిరమ్మ టవర్స్‌పై కలెక్టర్లతో సమీక్షలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్: క్యూర్ పరిధిలో మొదటి విడత 'ఇందిరమ్మ టవర్స్'కు స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు మరో రెండు విడతల కోసం ముందుగానే భూములను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లకు సూచించారు. క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 500 ఇళ్ల చొప్పున చేపడుతున్నామని.. ఇంకా స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో సర్కారు భూములను పరిరక్షిస్తూనే, యుద్ధప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి భూముల లభ్యత, ఇతర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని 3 జిల్లాల్లో రెండు పడక గదుల ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు. డ్రా ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారంతో తరువాయి 2లో



జులై వరకూ కరవే

- తాగుకు తప్ప.. సాగుకు నీరు లేదు
- ప్రజల్ని అప్రమత్తం చేయకుండా ఎదుర్కోలేం
- కరవుపై భారాస తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- యాదాద్రి ప్లాంట్ల వెనుక రూ.లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్రణాళికంటూ ఆరోపణ
- జ్ఞానేశ్ గోబ్యాక్ నినాదంతో రాహుల్‌గాంధీ పోరాటం
- నవంబరు 1న దిల్లీ సభకు భారీగా తరలివెళ్లాలని సీఎం పిలుపు

హైదరాబాద్ : ''అక్టోబరులో మొదలైన కరవు.. వచ్చే ఏడాది జులై వరకూ ఉంటుంది. ఎండ వేడి పెరుగుతుంది. తాగునీటికి తప్ప.. సాగుకు నీరు లేదు. తాగునీటికీ కష్టాలు వస్తాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సమస్య చిన్నదిగా మొదలై.. పెద్దదిగా మారుతోందని.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందన్నా తరువాయి 2లో



అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్
ప్రజలను నిండా ముంచింది

- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హైదరాబాద్: ''అబద్ధాలు, తప్పుడు ప్రచారంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు దోపిడీ పాలన సాగిస్తూ ప్రజలను నిండా ముంచింది'' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన అంబర్‌పేట నియోజకవర్గ భారాస కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక అన్ని వర్గాలను కష్టాల్లోకి నెట్టింది. తరువాయి 2లో

ఐరాసలో పాక్‌పై
భారత్ నిప్పులు

- భారత సైన్యం ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించిందని గుర్తుచేసిన భావిక
- పాక్‌లో మైనారిటీల హక్కుల ఉల్లంఘనపై భారత్ విమర్శలు
- జమ్మూ కశ్మీర్ వ్యవహారాల్లో జోక్యం మానుకోవాలని పాక్‌కు సూచన 2లో



కిమ్ జాంగ్ ఉన్ బతికే ఉన్నాడు..
వదంతులపై స్పష్టతనిచ్చిన ఎన్‌ఐఎస్

- పార్లమెంటరీ కమిటీకి వివరాలు అందించిన జాతీయ గూఢచార సంస్థ (NIS)
- వదంతులు వ్యాపించిన తర్వాత కూతురితో కలిసి కనిపించిన కిమ్
- దక్షిణ కొరియాపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కిమ్ సోదరి యో జోంగ్
- సరిహద్దుల్లో సైనిక నిర్మాణాలను ముమ్మరం చేసిన ఉత్తర కొరియా



ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ ఆరోగ్యంపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని దక్షిణ కొరియా స్పష్టం చేసింది. కిమ్ తీవ్ర అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి మరణించారంటూ వ్యాపించిన వార్తలన్నీ అవాస్తవాలని దక్షిణ కొరియా జాతీయ గూఢచార సంస్థ (NIS) తేల్చి చెప్పింది. ఈ మేరకు పార్లమెంటరీ ఇంటెలిజెన్స్ కమిటీతో జరిగిన రహస్య సమావేశంలో ఎన్‌ఐఎస్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమావేశంలో పాల్గొన్న సభ్యులు తెలిపారు. కిమ్ జాంగ్ ఉన్ తీవ్రమైన బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యారని, కోమాలోకి వెళ్లారని, చివరకు మరణించారంటూ విదేశీ సోషల్ మీడియాలో పుకార్లు వేగంగా వ్యాపించాయి. కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఈ వార్తలను ప్రసారం చేశాయి. అయితే, ఈ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని యోన్‌హాప్ న్యూస్ తరువాయి 2లో

మొజ్తబా ఖమేనీ ఎక్కడ?..
6 నెలల తర్వాత ఇరాన్ కీలక ప్రకటన!

- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆరోగ్యంపై నెలకొన్న అనుమానాలపై వివరణ
- ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, అధ్యక్షుడితో 7 గంటల సమావేశం జరిపారని వెల్లడి
- భద్రతా కారణాల వల్లే మీడియాకు దూరంగా ఉన్నారని, తండ్రి అంత్యక్రియల్లోనూ పాల్గొన్నారని వివరణ 2లో



- ఇరాన్‌ను ఎవరు నడిపిస్తున్నారో తెలియదన్న అమెరికా ఆరోపణలను ఖండించిన ఇరాన్



స్కాచ్ విస్కీకి అతిపెద్ద మార్కెట్‌గా భారత్.. అమెరికాను దాటి 2లో

నంబర్ 1 స్థానానికి!

- స్కాచ్ విస్కీకి అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనున్న భారత్
- భారత్-యూకే వాణిజ్య ఒప్పందంతో సగానికి తగ్గిన దిగుమతి సుంకాలు
- ప్రస్తుతం పరిమాణంలో నంబర్ 1, విలువలో మూడో స్థానంలో ఉన్న భారత్
- పన్నుల సమానత్వంపై దేశీయ మద్యం కంపెనీల ఆందోళన
- దిగుమతులతో పోటీకి సిద్ధమవుతున్న భారత తయారీదారులు

సుప్రీంకోర్టులో
'వందేమాతరం' వివాదం

- వందేమాతరం పూర్తి పాఠంపై సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇది ఆనందమఠ్ నవలలోని మతపరమైన యుద్ధ గీతమని ఆరోపణ
- కేంద్రం ఉత్తర్వులను రద్దు చేయాలని కోర్టుకు వినతి
- తొలి రెండు చరణాలనే జాతీయ గీతంగా గుర్తించాలని వాదన
- రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఈ ఉత్తర్వులు విఘాతమని ఆరోపణ 2లో



కిమ్ జాంగ్ ఉన్ బతికే ఉన్నాడు.. వదంతులపై స్పష్టతనిచ్చిన ఎన్ఐఎస్

ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ ఆరోగ్యంపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని దక్షిణ కొరియా స్పష్టం చేసింది. కిమ్ తీవ్ర అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి మరణించారంటూ వ్యాపించిన వార్తలన్నీ అవాస్తవాలని దక్షిణ కొరియా జాతీయ గూఢచార సంస్థ (NIS) తేల్చిచెప్పింది. ఈ మేరకు పార్లమెంటరీ ఇంటెలిజెన్స్ కమిటీతో జరిగిన రహస్య సమావేశంలో ఎన్ఐఎస్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమావేశంలో పాల్గొన్న సభ్యులు తెలిపారు. కిమ్ జాంగ్ ఉన్ తీవ్రమైన బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యారని, కోమాలోకి వెళ్లారని, చివరకు మరణించారంటూ విదేశీ సోషల్ మీడియాలో పుకార్లు వేగంగా వ్యాపించాయి. కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఈ వార్తలను ప్రసారం చేశాయి. అయితే, ఈ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ఈ వదంతులపై ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా నేరుగా స్పందించనప్పటికీ, వాటికి చెక్ పెడుతూ కిమ్‌కు సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది. ప్యాంగ్యాంగ్‌లో జరిగిన వస్త్ర, పాదరక్షల ప్రదర్శనలో కిమ్ తన కుమార్తె జు ఏతో కలిసి పాల్గొన్నారని, ఆ ఫోటోలను మంగళవారం ప్రచురించింది. గత నెలలో కూడా ఎన్ఐఎస్ కిమ్ ఆరోగ్యంపై నివేదిక ఇచ్చింది. కిమ్ 140 కిలోలకు పైగా బరువుతో తీవ్రమైన ఊబకాయంతో బాధపడుతున్నారని, దీనివల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉందని, అయితే ప్రస్తుతం ఆయనకు గుర్తించదగిన ఆరోగ్య సమస్యలేవీ లేవని తెలిపింది. ఆయన చురుగ్గా కదులుతున్నారని, ఓ నౌకను తనిఖీ చేసేటప్పుడు మెట్లు కూడా వేగంగా ఎక్కారని గుర్తు చేసింది. ఆయన ఆరోగ్యాన్ని ప్రత్యేక వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని వివరించింది. ఇదే సమావేశంలో కిమ్ సోదరి, వర్కర్స్ పార్టీ సీనియర్ అధికారి కిమ్ యో జోంగ్ కార్యకలాపాలపై కూడా ఎన్ఐఎస్ నివేదిక ఇచ్చింది. దక్షిణ కొరియా సరిహద్దు వెంబడి జరుగుతున్న సైనిక నిర్మాణాలను ఆమె రక్షణ శాఖ సలహాదారు పాక్ జోంగ్ చోన్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు "రెండు శత్రు దేశాల" వంటివని కిమ్ ప్రకటించిన నేపథ్యంలో, ఏప్రిల్ 2024 నుంచి ఉత్తర కొరియా తమ సరిహద్దులను బలోపేతం చేసుకుంటోంది. ఈ క్రమంలో, దక్షిణ కొరియాపై మళ్లీ ప్రచార లౌడ్‌స్పీకర్లను పునఃప్రారంభిస్తామని, "భయంకరమైన, బాధాకరమైన పరిస్థితి"ని ఎదుర్కోవాల్సి వస్తుందని కిమ్ సోదరి యో జోంగ్ హెచ్చరించినట్లు ఎన్ఐఎస్ పేర్కొంది.

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను నిండా ముంచింది

హైదరాబాద్: ''అబద్ధాలు, తప్పుడు ప్రచారంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు దోపిడీ పాలన సాగిస్తూ ప్రజలను నిండా ముంచింది'' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన అంబర్‌పేట నియోజకవర్గ భారాస కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక అన్ని వర్గాలను కష్టాల్లోకి నెట్టింది. కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి ప్రజలు తిప్పలు పడుతున్నారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. ఎల్‌నినో ప్రభావంపై మేం పది నెలల ముందే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినా పట్టించుకోలేదు. అనేక రాష్ట్రాలు ముందే జాగ్రత్తపడి ప్రాజెక్టులను నీటితో నింపితే మన రాష్ట్రంలోని ప్రభుత్వం మాత్రం ఆ పని చేయలేకపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి కారణంగానే ఈ దుస్థితి వచ్చింది. కాళేశ్వరం పంపులు నడిపితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతోనే సీఎం వాటిని ప్రారంభించడం లేదు. కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. రాహుల్‌గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డపై అబద్ధాలు చెప్పించారు. ఇకపై కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్, భాజపా రెండూ ఒక్కటే. రేవంత్‌రెడ్డి సంకేతాలకు అనుగుణంగానే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నడుచుకుంటున్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేద్దామా.. అని ఎదురుచూస్తున్నారు. మొత్తానికి రేవంత్‌రెడ్డి హడావుడి మరో ఏడాది సాగుతుంది. ఆ తర్వాత కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలను నిర్వహించే ధైర్యం ముఖ్యమంత్రికి లేదు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా భారాస కార్పొరేషన్లను గెలుచుకుంటుంది. త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి భారాస అభ్యర్థులను గెలిపించాలి'' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాచ్ విస్కీకి అతిపెద్ద మార్కెట్‌గా భారత్...

ప్రపంచ స్కాచ్ విస్కీ మార్కెట్‌లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పరిమాణం (వాల్యూమ్) పరంగా అగ్రస్థానంలో ఉన్న మన దేశం, త్వరలోనే విలువ (వాల్యూ) పరంగా కూడా ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుందని స్కాచ్ విస్కీ అసోసియేషన్ అంచనా వేసింది. ఈ క్రమంలో అగ్రరాజ్యం అమెరికాను కూడా భారత్ అధిగమించనుంది. భారత్‌యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ), దేశంలో ప్రీమియం మద్యం ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ ఈ మార్పునకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

తగ్గిన సుంకాలు.. పెరిగిన ఆశలు

భారత్‌యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జులై 15 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా స్కాచ్ విస్కీ దిగుమతులపై ఉన్న 150 శాతం కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకంగా సగానికి, అంటే 75 శాతానికి తగ్గించింది. అంతేకాదు, రాబోయే పదేళ్లలో ఈ సుంకాన్ని దశలవారీగా 40 శాతానికి తగ్గించనున్నారు. ఈ నిర్ణయంతో స్కాచ్ విస్కీ సామాన్యులకు మరింత అందుబాటులోకి వస్తుందని, వినియోగదారులు ప్రీమియం ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతారని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీని ప్రభావం ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో కనిపిస్తోంది. కొన్ని బ్రాండ్ల ధరలు 6 నుంచి 15 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. గణాంకాల ప్రకారం.. 2025లో భారత్‌కు స్కాచ్ విస్కీ ఎగుమతుల విలువ 286 మిలియన్ పౌండ్లు (సుమారు రూ.3,614 కోట్లు) గా ఉంది. ఇది దాదాపు 220 మిలియన్ బాటిళ్లతో సమానం. ప్రస్తుతం విలువ పరంగా చూస్తే అమెరికా, ఫ్రాన్స్ తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా కొనసాగుతోంది. అయితే, తగ్గిన సుంకాలతో ఈ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి.

*** దేశీయ కంపెనీల ఆందోళన.. వ్యూహరచన**

అయితే, దిగుమతి సుంకాల తగ్గింపుపై 'భారత ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీల సమాఖ్య' (సీఐఏబీసీ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. దేశీయ, విదేశీ ఉత్పత్తుల మధ్య సమానమైన పోటీ ఉండేలా పన్నుల విధానంలో సమానత్వం పాటించాలని డిమాండ్ చేస్తోంది. కేవలం దిగుమతి సుంకం తగ్గించినంత మాత్రాన తుది ధర పూర్తిగా తగ్గదని, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు, పంపిణీ ఖర్చులు, రిటైలర్ల మార్జిన్‌లు కూడా తుది ధరను నిర్దేశిస్తాయని స్పష్టం చేసింది. మరోవైపు విదేశీ స్కాచ్ నుంచి పోటీ పెరగడంతో దేశీయ తయారీదారులు కూడా తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. దిగుమతి చేసుకున్న స్కాచ్‌తో పోటీ పడేందుకు వీలుగా డిస్టిలేషన్, మెచ్యూరేషన్, నాణ్యత వంటి అంశాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ప్రీమియం సెగ్మెంట్‌లో తమదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం మీద ఈ కొత్త పరిణామాలతో భారత మద్యం మార్కెట్ రానున్న రోజుల్లో మరింత పోటీతత్వంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరో రెండు విడతలకూ భూములు సిద్ధం చేయాలి

హైదరాబాద్: క్యూర్ పరిధిలో మొదటి విడత 'ఇందిరమ్మ టవర్స్'కు స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు మరో రెండు విడతల కోసం ముందుగానే భూములను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లకు సూచించారు. క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 500 ఇళ్ల చొప్పున చేపడుతున్నామని.. ఇంకా స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో సర్కారు భూములను పరిరక్షిస్తూనే, యుద్ధప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి భూముల లభ్యత, ఇతర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని 3 జిల్లాల్లో రెండు పడక గదుల ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు

జులై వరకూ కరవే

హైదరాబాద్: ''అక్టోబరులో మొదలైన కరవు.. వచ్చే ఏడాది జులై వరకూ ఉంటుంది. ఎండ వేడి పెరుగుతుంది. తాగునీటికి తప్ప.. సాగుకు నీరు లేదు. తాగునీటికీ కష్టాలు వస్తాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సమస్య చిన్నదిగా మొదలై.. పెద్దదిగా మారుతోందని.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని దాచిపెడితే.. అది క్యాన్సర్‌లా మారుతుందని.. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో.. ప్రజలను అప్రమత్తం చేయకుండా.. వారి భాగస్వామ్యం లేకుండా ఈ కరవును ఎదుర్కోలేమన్నారు. నిజాలను ప్రజలకు వెల్లడించకపోతే.. అన్నిరకాలుగా దెబ్బతింటామని సీఎం స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో 'ఎల్‌నినో ప్రభావం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, సర్‌లో ఓట్ల తొలగింపు' తదితర అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

మామ, అల్లుళ్లు ఇద్దరే మేధావులా?

''ఎల్‌నినో ప్రభావం ఉత్తర తెలంగాణలో ఒకరకంగా, దక్షిణ తెలంగాణలో మరో రకంగా ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోతీరుగా ఉంది. కచ్ ప్రాంతంలో, మహారాష్ట్రలో కొన్ని చోట్ల నీటి సరఫరాకు రేషన్‌పెట్టారు. కనీసం 20 శాతం నీటి వినియోగం తగ్గించుకోవాలని మహారాష్ట్రలో మార్గదర్శకాలు ఇచ్చారు. భారాస నేతలేమో.. 'ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు' అని ప్రకటనలు చేస్తున్నారు. మామ, అల్లుళ్లు ఇద్దరే మేధావులా? కేసీఆర్ ఫాంహౌస్‌లో ప్రణాళికలు చేస్తే.. హరీశ్‌రావు, కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2019లో కరోనా వచ్చినప్పుడు శాసనసభలో కేసీఆర్ మాట్లాడుతూ ఎండకొడితే ఆ వేడికి కొవిడ్ పోతుందన్నారు. చివరికి లక్షల మంది చనిపోయారు. ఇప్పుడు హరీశ్‌రావు మాటలు నమ్మి పంటలు సాగుచేస్తే.. మట్టి పోసి అంబలి కాచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సమర్థంగా తిప్పికొట్టాలి. రైతువేదికలకు వెళ్లి నిజాలు చెప్పాలి. మరోపక్క అప్పులు తెచ్చి.. విద్యుత్ కొందామన్నా లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే పొదుపు మంత్రం పాటిస్తే.. విద్యుత్ ఆదా అవుతుంది. కార్యాలయాల్లో అవసరం లేకపోతే పగటిపూట ఒక ట్యూబ్‌లైట్ కూడా వేయవద్దు. ఏసీలు తగ్గించాలి. మా సొంత ఊరు కొండారెడ్డిపల్లి మొత్తం ఇళ్లపై సౌర విద్యుత్ పెట్టించాం. ఇళ్లలో వాడుకున్నది పోగా.. మిగిలిన కరెంటు అమ్మితే రూ.1020 వేల దాకా ఒక్కో ఇంటికి రావడంతో దసరా దావత్ చేశారు. అన్ని గ్రామాల వారిని కొండారెడ్డిపల్లి తీసుకెళ్లి చూపించండి. మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసి.. ఇళ్లపై సోలార్ పెట్టించాలి.

సుప్రీంకోర్టులో 'వందేమాతరం' వివాదం

జాతీయ గేయం 'వందేమాతరం'పై కొత్త వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ప్రభుత్వ, విద్యా సంబంధిత కార్యక్రమాల్లో ఆరు చరణాల వందేమాతరం గేయాన్ని ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరు చరణాల గేయం 'ఆనందమఠ్' నవలలోనిదని, అది ఒక మతపరమైన యుద్ధ గీతమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 28, జులై 9 తేదీలలో కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆరు చరణాల వందేమాతరం పాడాలని నిర్దేశించారు. అయితే, ఈ పూర్తి గేయంలో హిందూ దేవతలైన దుర్గా, లక్ష్మీ, సరస్వతిని స్తుతిస్తూ, ముస్లింలపై విజయం కోసం ప్రార్థించే వైష్ణవ, శాక్తేయ ప్రస్తావనలు ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిని పాడాలని పౌరులను బలవంతం చేయడం వారి మనస్సాక్షి స్వేచ్ఛను హరించడమేనని వాదించారు. ఇది రాజ్యాంగంలోని అధికరణలు 14, 19, 21, 25, 28లకు విరుద్ధమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జాతీయ గేయంగా గుర్తింపు పొందిన తొలి రెండు చరణాలు కేవలం మాతృభూమి సౌందర్యాన్ని, గొప్పదనాన్ని వర్ణిస్తాయని, వాటికి ఎలాంటి మతపరమైన నేపథ్యం లేదని పిటిషన్‌లో వివరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్, 1937 నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా తొలి రెండు చరణాలనే ఆమోదించాయని గుర్తుచేశారు. కేంద్రం కొత్త ఉత్తర్వులు దేశ లౌకికవాదం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక స్వరూపాలపై దాడి చేయడమేనని ఆరోపించారు. కాబట్టి, వివాదాస్పద ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, కేవలం తొలి రెండు చరణాలనే జాతీయ గేయంగా అధికారికంగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. అలాగే, మత విశ్వాసాల కారణంగా ఈ గేయాన్ని ఆలపించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై గతంలో కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణతో పాటు మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

మొజ్తబా ఖమేనీ ఎక్కడ?.. ఆరు నెలల తర్వాత ఇరాన్ కీలక ప్రకటన!

ఆరు నెలలుగా ప్రజల మధ్యకు రాకుండా అజ్ఞాతంలో ఉన్న ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆరోగ్యంపై నెలకొన్న వదంతుల పట్ల ఆ దేశం వివరణ ఇచ్చింది. ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, దేశ పాలనా వ్యవహారాలను చురుగ్గా పర్యవేక్షిస్తున్నారని ఇరాన్ సీనియర్ దౌత్యవేత్త అబ్దుల్ మజీద్ హకీమ్ ఎలాహి స్పష్టం చేశారు. గడిచిన వారంలోనే దేశాధ్యక్షుడితో మొజ్తబా ఏకంగా ఏడు గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించారని 'ఎన్బీటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. దాదాపు ఎనిమిది నెలల క్రితం ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ దాడిలోనే ఫిబ్రవరి 28న అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ దాడిలో మొజ్తబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. తండ్రి మరణానంతరం అత్యున్నత నేతగా బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఆయన ఒక్కసారి కూడా బహిరంగంగా కనిపించలేదు. కేవలం రాతపూర్వక ప్రకటనల ద్వారానే సందేశాలు ఇస్తున్నారు. జులైలో జరిగిన తండ్రి అంత్యక్రియలకు కూడా ఆయన గైర్హాజరు కావడం, ఆయన ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనలకు, భద్రతాపరమైన భయాలకు దారితీసింది. ఈ నేపథ్యంలో అబ్దుల్ మజీద్ ఎలాహి వివరణ ఇస్తూ.. "సుప్రీం లీడర్ మొజ్తబా ఖామేనీ చాలా మంచి ఆరోగ్యంతో ఉన్నారు. తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. గతనెలలో అధ్యక్షుడితో 7 గంటల పాటు భేటీ అయ్యారు. రేపు మా పార్లమెంట్ స్పీకర్ కూడా ఆయన్ను కలవనున్నారు. నేను కలిసిన నా స్నేహితులు కూడా ఆయన చాలా ఆరోగ్యంగా ఉన్నారని, పనులన్నీ చక్కగా చేసుకుంటున్నారని నాతో చెప్పారు" అని తెలిపారు. తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా రాలేదన్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. "భద్రతా కారణాల దృష్ట్యా ఆయన మీడియా ముందుకు రావడం లేదు. అందుకే ఎవరూ ఆయన్ను చూడలేదు. కానీ, ఆయన తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో నేను ఇరాన్‌లోనే ఉన్నాను. ఆయన సోదరులిద్దరినీ కలిశాను. మొజ్తబా కూడా అక్కడే ఉన్నారు. కొన్నిసార్లు ఆయన రాత్రిపూట వీధుల్లోకి కూడా వస్తారు. ప్రజల ప్రదర్శనల్లో పాల్గొంటారు" అని ఎలాహి వివరించారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌ను ప్రస్తుతం ఎవరు నడిపిస్తున్నారో ఎవరికీ తెలియడం లేదంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ కు నేతలు లేకుండా పోయారని, దేశాన్ని ఎవరు పాలిస్తున్నారనేది తమకు పెద్ద సమస్యగా మారిందని ఆయన అన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీలతో తాము మాట్లాడుతున్నామని, కానీ దేశంలో వారికి ఎంత అధికారం ఉందో స్పష్టత లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ శాఖ ఖండించింది. ఇరాన్‌లో నిర్ణయాధికారం ఎవరి చేతుల్లో ఉందో, తమ ప్రతినిధులు ఎవరో అమెరికా అధికారులకు బాగా తెలుసని స్పష్టం చేసింది.

ఐరాసలో పాక్‌పై భారత్ నిప్పులు

మత స్వేచ్ఛ, మైనారిటీల హక్కులపై భారత్‌కు నీతులు చెప్పే పాకిస్థాన్ తీరును ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా భారత్ తీవ్రంగా ఎండగట్టింది. 1999 కార్గిల్ యుద్ధంలో మరణించిన తమ సైనికుల మృతదేహాలను కూడా పాకిస్థాన్ స్వీకరించలేదని గుర్తుచేసింది. అలాంటి దేశం మత విశ్వాసాలు, అంత్యక్రియల హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఐరాసలో భారత తొలి కార్యదర్శి భావిక మంగళానందన్ విమర్శించారు. అంత్యక్రియల హక్కులకు సంబంధించిన అంశంపై మత స్వేచ్ఛ, విశ్వాసాలపై ఐరాస ప్రత్యేక ప్రతినిధితో జరిగిన చర్చలో భారత దౌత్యవేత్తలు ఈ వ్యాఖ్యలు చేశారు. కార్గిల్ యుద్ధంలో మరణించిన పలువురు పాకిస్థాన్ సైనికులకు భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించిందని భావిక గుర్తుచేశారు. ఈ వాస్తవాలను ప్రత్యేక ప్రతినిధి నివేదికలో ప్రస్తావించకపోవడాన్ని ప్రశ్నించారు. జమ్మూ కశ్మీర్ వ్యవహారాల్లో పాకిస్థాన్ జోక్యం చేసుకోవడం మానుకోవాలని ఆమె సూచించారు. పాక్ ఆక్రమణలో ఉన్న జమ్మూ కశ్మీర్ ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై ఆ దేశం దృష్టి పెట్టాలని అన్నారు. పాకిస్థాన్‌లో మైనారిటీల సంఖ్య తగ్గిపోతోందని, వారి హక్కులు తరచూ ఉల్లంఘనలకు గురవుతున్నాయని ఆరోపించారు. సొంత దేశంలోని మైనారిటీలకు రక్షణ కల్పించలేని పాకిస్థాన్‌కు భారత్‌కు సలహాలు ఇచ్చే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. కరోనా మహమ్మారి సమయంలో జరిగిన వివక్ష, అక్రమాలపై ప్రత్యేక ప్రతినిధి నివేదికలో అభివృద్ధి చెందిన దేశాల్లోని ఘటనలను ప్రస్తావించకపోవడాన్ని కూడా భావిక ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల బాధలను ఉపయోగించుకోవడం తగదన్నారు. ఉగ్రవాదుల అంత్యక్రియల హక్కుల గురించి మాట్లాడుతున్న నివేదిక.. ఉగ్రవాద బాధితుల హక్కులకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. అమాయకుల ప్రాణాలను తీసే ఉగ్రవాదుల హక్కులపై చూపుతున్న శ్రద్ధ, బాధితుల విషయంలోనూ కనిపించాలని అన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు నవంబర్ 16 లోపు చెల్లించాలి

*** విద్యాధికారి దర్శనం భోజన్న**



ప్రజాస్ఫూర్తి, బైంసా : తెలంగాణ ప్రభుత్వ డైరెక్టర్ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో మార్చి 2027లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఫీజును 2026 నవంబర్ 16 లోపు చెల్లించాలని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.రెగ్యులర్ విద్యార్థులు రూ. 125 ఫీజు చెల్లించాలని.. ఒకేషనల్ విద్యార్థులు దీనికి అదనంగా రూ. 60 ఫీజు చెల్లించాలని అధికారి పేర్కొన్నారు. ఈ ఫీజును ఐఎఫ్ఎస్సీ పోర్టల్ సైబర్ ట్రెజరీ చాలన్ ద్వారా చెల్లింపు చేయాలని అధికారి సూచించారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలంగాణ వెబ్‌సైట్‌ను ప్రధానోపాధ్యాయులు తమ యూజర్ ఐడీ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఫిజు మినహాయింపు ఉంటుందన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించిన అనంతరం జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు ప్రిన్సిపాల్స్.. 21 నవంబర్ 2026 లోపు విద్యార్థుల డేటాను ఆన్‌లైన్‌లో డీఈఓ కార్యాలయానికి పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్షల అదనపు కమిషనర్ ముదారపు పరమేశ్వర్‌ను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

గూడ్స్ వాహనం ఢీకొన్ని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

జనగామ,ప్రజాస్ఫూర్తి: లింగాల ఘణపురం మండలం వనపర్తి స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 365బీపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో జనగామ నుంచి దేవరుప్పుల వైపు వెళ్తున్న టాటా ఇంట్రా మినీ గూడ్స్ వాహనం అతివేగంగా వచ్చి, జనగామ నుంచి నేలపోగుల వైపు వెళ్తున్న గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నేలపోగుల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోకల సత్యనారాయణ (59) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అంతర్గత గాయాల కారణంగా మృతి చెందినట్లు సాయంత్రం సుమారు 5 గంటలకు వైద్యులు ధ్రువీకరించారు. గూడ్స్ వాహనంలో ఉన్న డ్రైవర్ కరె రాజు, ఆయన భార్య కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన పెద్దమడూరుకు చెందిన కరె రాజుపై చర్యలు తీసుకోవాలని బాధితుల తరపున అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలియో వ్యాధి నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలి

*** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు**



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా: పోలియో వ్యాధి నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ పోలియోవైరస్ వలన వ్యాపిస్తుందని, పోలియో ఒక ప్రమాదకరమైన వ్యాధి అని ఇది ముఖ్యంగా కలుషితమైన ఆహారము ,నీరు, పోలియో సోకిన వ్యక్తి మలము ద్వారా ఈ వైరస్ బయటకు వస్తుందని,చేతులు సరిగా కడుక్కోకపోవడం వల్ల లేదా పారిశుద్ధ్య లోపాలు ఉన్నప్పుడు ఈ వైరస్ ఆహారము,తాగునీటి ద్వారా ఇతరుల శరీరంలోకి నోటి ద్వారా ప్రవేశిస్తుందని ఇది ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ప్రభావితం చేసి, శాశ్వత పక్షవాతానికి గురిచేస్తుందని పేర్కొన్నారు.పోలియో వ్యాధిని పూర్తిగా నివారించడానికి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం పోలియో చుక్కలు, పోలియో టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమైనదన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

కొమురం భీమ్ 86వ వర్ధంతికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతిని ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు ఆదేశించారు. వర్ధంతి ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ఆదివాసీ ప్రజలు, సందర్శకులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, వాహనాల పార్కింగ్, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను భావితరాలకు చాటేలా ఈ కార్యక్రమాన్ని గౌరవప్రదంగా విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ కె.హరిత**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కెరమెరి మండలం నాగపూర్ గ్రామంలో చేపడుతున్న భూముల రీ సర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేపట్టే విషయాన్ని సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. ప్రతి రైతు సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేయాలన్నారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ హద్దుల వివాదాలు, గట్టు పంచాయితీలు తగ్గుతాయని పేర్కొన్నారు.సర్వే ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేలో ఖచ్చితత్వం కోసం రోవర్లను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలి

*** రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు**

ప్రజాస్ఫూర్తి, బైంసా: గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు.వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

*** పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు.పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై



సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ పరిశీలనలో ఇన్ చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గొల్లగూడెం రోడ్ వెడల్పుకు స్థలాన్ని కేటాయించాలి

*** సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్. శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం:కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి వచ్చిన సికింద్రాబాద్ డివిజన్ జనరల్ మేనేజర్ గోపాలకృష్ణన్ కు డి. ఆర్ యు సి.సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి , కొత్తగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ టెంపుల్ టు టెంపుల్ టూర్ లో భాగంగా తిరుపతికి షిరిడికి ప్రత్యేక రైలు నడిపిస్తామని గతంలో హామీ ఇచ్చారని ఆహామీని తక్షణమే నిలబెట్టుకోవాలని తక్షణమే తిరుపతికి షిరిడి కి ప్రత్యేక రైలునడపాలని ,కొత్తగూడెం రైల్వే అభివృద్ధి పనులు తక్షణమే పూర్తి చేయాలని , గోదావరి పుష్కరాల నాటికి గతంలో రద్దు చేసిన ట్రైన్స్ ను తిరిగి నడిపించాలని రైల్వే స్టేషన్ సెంటర్ నుండి గొల్లగూడెం వరకు రోడ్డు వెడల్పు విస్తరణ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు . అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయగా డిఆర్ఎం స్పందిస్తూ అభివృద్ధితో పాటు రద్దు చేసిన ట్రైన్స్ ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్తగూడెం అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాసరావు, నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, సత్యనారాయణ అగ్రవాల్, అనూప్ ఖండేల్వాల్, వందనపు రాము, బిచ్చు అగ్రవాల్, గోపాల్ పంచార్య, సలి దండి రవి, వందనపు సూర్య ప్రకాష్ రావు , తదితరులు పాల్గొన్నారు.

పొనుగోడులో ముమ్మరంగా ఓటర్ నమోదు కార్యక్రమం

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:పొనుగోడు బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్ , ఖమ్మం, నల్గొండ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం రెండో రోజు ముమ్మరంగా కొనసాగింది. పట్టభద్రులందరూ స్వచ్ఛందగా వచ్చి దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు , ఉద్యోగులకి ఇచ్చిన హామీలని తుంగలోకి తొక్కి వారిని మోసం చేసిందన్నారు. అలవు కానీ గారడి మాటలతో గద్దెని ఎక్కి అధికారంలోకి వచ్చాక యువతని పూర్తిగా మర్చిపోయారన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు,



పట్టభద్రులందరూ తగిన బుద్ధి చెప్పాలన్నారు. బిఆర్ఎస్ జైత్రయాత్ర ఎమ్మెల్సీ ఎన్నికలతో ప్రారంభం కానుందన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని ఓటు హక్కునీ వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, వార్డు మెంబర్లు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నాయకులు పొలంపల్లి మహా ఆంజనేయులు,భాస్కర్, నందిపాటి మధు, నరహరి, రామ్ సతీష్, పంగ నాగయ్య, పట్టభద్రులు కొత్త వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి, బానిసత్వ నిర్మూళ నకు కృషి చేయాలి

– అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సమాజంలో కొనసాగుతున్న వెట్టి చాకిరి, బానిసత్వం వంటి అమానవీయ దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించేలా చూడాలని అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనపై కార్మిక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మిక హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెట్టి చాకిరి అనేది మానవ హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని అన్నారు. ఎవరినైనా బలవంతంగా పనులు చేయించడం, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా పనిచేయించుకోవడం, కార్మికుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి శ్రమను దోపిడీ చేయడం వంటి చర్యలను అరికట్టాలని సూచించారు. ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉందని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా ధనం' రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలన, బాధితుల గుర్తింపు, వారికి పునరావాసం కల్పించడం, కార్మికుల హక్కులపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వెట్టి చాకిరికి సంబంధించిన ఫిర్యాదులు, సహాయం కోసం 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించి సమాచారం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్యామల ప్రమోద్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె. శ్రీరామ్, సహాయ కార్మిక అధికారులు బి. నాగరాజు, పి.వి.కె. శాస్త్రి, ఎ. యేసుపాదం, చి. రజిత, , ఏహెచ్‌టీఓ బృందం, ఏఐడీ ఎన్‌జీఓ ప్రతినిధులు, ఐజేఎం ప్రచార సాధకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుధాగాని వెంకటేష్ గౌడ్

కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి:దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుధాగాని వెంకటేష్ గౌడ్ తెలంగాణ భవన్లో మర్యాద పూర్వకంగా కలిసి విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యకు పరామర్శ



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట మండలం బాలెంల స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యను స్థానిక ఏరియా హాస్పిటల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి అందిస్తున్నవైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జానయ్య ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. వారి వెంట మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్, పులగం వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ గొల్ల వెంకన్న, మాజీ జెడ్పిటిసి అవిలయ్య, బాలెంల మాజీ సర్పంచ్ రామసాని రమేష్, దాస్ తండా మాజీ సర్పంచ్ మోతిలాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా నాయకులు మిద్దె రమేష్, మోదాల ముత్తయ్య, భాస్కర్, పులగం సైదిరెడ్డి, పందిరి మల్లేష్, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, పిల్లల నాగరాజు, షేక్ గౌస్ పాషా, అనంతుల నవీన్, రావుల రమేష్, బూర సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

*** కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :సుజాతనగర్ మండలం సుజాతనగర్ గ్రామంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మేయర్ మూడ గణేష్ సమక్షంలో కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నాయక్ ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి , టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు , కొత్తగూడెం సొసైటీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు , మార్కెట్ కమిటీ సభ్యులు , స్థానిక రైతులు, మార్కెటింగ్ అధికారి ఎంఏ ఆలిం , మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండి హిమాయత్ హుస్సేన్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలి

*** రంగారెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలని రంగారెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సంక్షేమ సంఘం అధ్యక్షులు కాపా సుబ్బారెడ్డి ,కమిటీ సభ్యులు శుక్రవారం చింతల్ లోని కార్పొరేటర్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమిటీ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలని అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయన్నారు. పెండింగులో ఉన్న అభివృద్ధి పనులను విడతల వారీగా పూర్తిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్లి భాస్కర్ రెడ్డి , కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో రైతు మృతి



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామ శివారులో మానస్పద స్థితిలో రైతు మిన్నలాపురం సిద్దయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు. శుక్రవారం ఉదయం తన వ్యవసాయ భూ మి వద్ద బర్రె పాలు పిండేందుకు వెళ్లిన సిద్దయ్య మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ ఘటనలో ఆయన ప్రాణా లు కోల్పోయారు. సమాచారం అందు కున్న అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్రం లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనతో కొడవటూరు గ్రామంలో విషాదం నెల కొంది. ఘట నకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సామాజిక సేవలకు దక్కిన గుర్తింపు

*** గూగులోత్ కిషన్ నాయక్ ను ఘనంగా సత్కరించిన విశ్రాంత ఉద్యోగులు**



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన గుగులోతు కిషన్ నాయక్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి మండల యూనిట్ అధ్యక్షులు రూప్ రెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా,జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మైస నాగయ్య,కొండ బత్తుల ఈశ్వర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల కార్యదర్శి కంపాటి మహేందర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య మాట్లాడుతూ గుగులోత్ కిషన్ నాయక్ అనేక ఏళ్లుగా పేదల పక్షాన నిలబడి సేవ చేస్తున్నారు.ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమించడం గర్వకారణం" అన్నారు.అనంతరం గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ కమిటీ సభ్యునిగా అవకాశం రావడం సంతోషంగా ఉందని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, విద్యార్థులు, మహిళల సమస్యలపై పోరాడుతూ,ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని,కుల వివక్ష లేని సమాజం కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు.తనకు ఈ గౌరవం దక్కడానికి సహకరించిన నాయకులకు, విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులందరికీ, మిత్రులకు,శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వలబోజు సోమయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగేందర్,మండల ఆర్థిక కార్యదర్శి రఘుపతి, గౌరవాధ్యక్షులు రత్నమాచారి,ఐ.వి. రమణయ్య,జిల్లా ముఖ్య సలహాదారులు సంక బద్రి నారాయణ, జిల్లా సంఘం అసోసియేట్ అధ్యక్షులు రంగారెడ్డి, గోవర్ధన్,మోహన్ రావు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జనగణన పకడ్బందీగా నిర్వహించాలి

*** వివరాల నమోదు, గోప్యతపై సిబ్బందికి కలెక్టర్ రాహుల్ శర్మ దిశానిర్దేశం**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): జిల్లాలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను సమగ్రంగా, పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జనగణన రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.గతంలో హౌస్ లిస్టింగ్, మొదటి దశ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో రెండో దశను పూర్తి చేయాలన్నారు. జనగణన ద్వారా సేకరించే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు కీలకమని పేర్కొన్నారు. ఈసారి డిజిటల్ విధానంలో మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయనున్నందున సిబ్బంది సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. స్వీయ గణన, కులాలవారీ వివరాల సేకరణకు సంబంధించిన విధానాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సంబంధిత మాన్యువల్‌ను పూర్తిగా అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాలన్నారు. జనగణన చట్టం 1948 ప్రకారం సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, అనధికార వ్యక్తులతో పంచుకోరాదని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సుబ్బరాజు, సీపీఓ కిష్టయ్య, ఆర్డీఓ హరికృష్ణ, మాస్టర్ ట్రైనర్లు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల దీక్షకు బీజేపీ మద్దతు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మానుకోట జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ సెంటర్ లో గత 11 రోజులుగా దీక్ష చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు బీజేపీ మద్దతు తెలిపింది.20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడం దారుణమని,వారికి సమాన పనికి సమాన వేతనం, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్,ఈహెచ్ఎస్ సదుపాయం కల్పించాలని జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఒద్దిరాజు రామచంద్రరావు,క్యాజువల్ శ్యాంసుందర్ శర్మ,గడ్డం అశోక్,పల్లె సందీప్,దిడ్డి మహేష్,గూగులోతు సురేష్ నాయక్,జహిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి: భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ నియమితులయ్యారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆశీస్సులతో,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కు పొన్నం శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకానికి సహకరించి,ప్రోత్సాహం అందించిన సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకన్న,కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రావు,హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి,మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ,జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సూచనలు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా



తీసుకెళ్తానని,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి,రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు.తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ,పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన శక్తియుక్తులు లేకుండా కృషిచేస్తానని వెల్లడించారు.శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

గుడిసెలో నివసిస్తున్న నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

*** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి:హుస్నాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తెలిపారు.నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా రహదారి విస్తరణ తదితర కారణాలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

సుందరగిరిలో రోడ్డు ప్రమాదం...

*** గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. దేవాలయం ముందు పని ముగించుకుని మెడికల్ షాపులో మందులు తీసుకుని ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని టూవీలర్ వాహనం ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు.బాధితుడిని సుందరగిరి గ్రామానికి చెందిన ఎలగందుల ఎల్లయ్య (70) గా గుర్తించారు.ఎల్లయ్య ,దేవాలయం పని ముగించుకుని మందులు తీసుకుని నడుచుకుంటూ వస్తుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.ఈ ప్రమాదంలో ఎల్లయ్య తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం వాహనదారుడు అక్కడి నుండి పరారయ్యాడు.స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు, సిబ్బందికి సీపీ కీలక ఆదేశాలు



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:మరిపెడ పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి నాలుగవ జోన్, డీఐజీ స్వేతా ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలు,కిట్ ఆర్టికల్స్, యూనిఫాంలు,ఫైళ్ల నిర్వహణ,5 ఎస్ విధానం అమలును పరిశీలించారు. క్రైమ్ రికార్డులు,డ్రగ్స్ డిస్పోజల్, గన్ లైసెన్స్, డ్యూటీ రోస్టర్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.ప్రతి సిబ్బందికి అన్ని రికార్డులపై పూర్తి అవగాహన ఉండాలని,గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండి ప్రజా భద్రతకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ప్రతిష్టసిబ్బంది పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు.ఎన్ డీపీఎస్,పెండింగ్, సైబర్,పోక్సో కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని, సైబర్ మోసాలపై 1930 హెల్ప్ లైన్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి, ఆరోగ్యం, వ్యక్తిగత,ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని హితవు పలికారు.

పానగల్ ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు

*** మంత్రి కోమటిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.**

*** పానగల్ ను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ:నల్గొండ జిల్లా కేంద్ర సమీపంలోని చారిత్రాత్మక పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయం, పరిసర ప్రాంతాల సమగ్ర సుందరీకరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో పానగల్ లోని శ్రీ చాయ సోమేశ్వర స్వామి దేవాలయం,పరిసర ప్రాంతాలు, సమీపంలోని జల వనరులను సమగ్రంగా అభివృద్ధి చేసి సుందరీకరించాలని ప్రతిపాదించారు.ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. ఈ నిధులను ఉపయోగించి పానగల్ లోని శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం దాని పరిసర ప్రాంతాలు సమీపంలోని జల వనరుల సమగ్ర సుందరీకరణ మరియు అభివృద్ధి పనులను చేపట్టనుంది. అదేవిధంగా దేవాలయాలను ప్రముఖ వారసత్వ ఆధ్యాత్మిక మరియు పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనుంది.

*** చరిత్రకు సజీవ సాక్ష్యం పానగల్ దేవాలయాలు. -బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

పానగల్ లోని పచ్చల, ఛాయా సోమేశ్వర దేవాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యమని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పానగల్‌లోని చారిత్రాత్మక శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ పరిసరాల సుందరీకరణ, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు.చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పానగల్ ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.చారిత్రక ఆలయాల పరిరక్షణతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. పానగల్ ప్రాంత అభివృద్ధికి ఈ నిధుల మంజూరు కీలక ముందడుగుగా నిలుస్తుందని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

గుండాల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల నమోదు, ప్రయోగశాల పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలను పరిశీలించారు.ప్రతిరోజూ ఆసుపత్రికి వస్తున్న ఔట్ పేషెంట్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్‌తో పాటు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి, రోగుల వివరాలను సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు, ఈ రోజు సేకరించిన శాంపిళ్ల సంఖ్యను రిజిస్టర్ల ద్వారా తనిఖీ చేశారు. రోగులకు అవసరమైన పరీక్షలను సకాలంలో నిర్వహించి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారు ఏ ఆరోగ్య సమస్యతో ఆసుపత్రికి వచ్చారు, ఎన్ని రోజులుగా చికిత్స పొందుతున్నారు, వైద్యులు సక్రమంగా చికిత్స అందిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు,సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, నాగిరెడ్డి, చేనేత మరియు జోలి శాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో, పీహెచ్సీ వైద్యాధికారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వివిధ పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లాలో ఆయుష్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుష్ మిషన్ లో వివిధ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 3, ఫార్మసిస్ట్ పోస్ట్ 1, సైకో సోషల్ కౌన్సిలర్ 1, యోగ ప్రొఫెషనల్ పోస్ట్ 1, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టు 2, లకు 18 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల వయసు గల అభ్యర్థుల అర్హులని, ఈనెల 26 10 2026 నుంచి 31102026 తేదీలోపు కలెక్టర్ కార్యాలయంలోని డి ఎం అండ్ హెచ్ ఓ కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్హత ,జీతభత్యాలు వివరాల కోసం medak.telangana.gov.in అందుబాటులో ఉన్నాయని వెబ్సైట్ లో సంప్రదించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్నేహితుడి పై హత్యాయత్నం నిందితుడి అరెస్టు



ప్రజాస్ఫూర్తి, జన్నారం: జన్నారం మండలంలో స్నేహితుడిపై హత్యాయత్నం విషయం కలకలం రేపింది. స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.... జన్నారం మండలంలోని దేవుని గూడా గ్రామానికి చెందిన పోకల పంశీ (19), అతని స్నేహితుడైన కామన్ పల్లి గ్రామానికి చెందిన సాట్ల సాయి శివ (20) నీ ఈనెల 20వ తేదీన రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో ఫోన్ చేసి బయటికి రమ్మని పిలిచాడు. దేవుని కూడా గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో గతంలో ఒక అమ్మాయి విషయంలో ఇరువురికి జరిగిన వివాదం, తన వ్యక్తిగత విషయాలను ఇతరులకు చెపుతున్నాడని కోపంతో సాయి శివ పంశీ తో గొడవపడ్డాడు. అతన్ని బూతులు తిడుతూ, చేతులతో కొడుతూ తన దగ్గర ఉన్న కీ చైన్ కత్తితో వంశి కడుపు దగ్గర మరియు పక్కటెముల దగ్గర పొడిచి అత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడ్డ వంశీని స్థానికులు జన్నారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుని తల్లి పోకల కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడు సాట్ల సాయిశివను అరెస్టు చేసి రిమాండ్కు పంపించినట్లు స్థానిక ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

భూపాలపల్లి పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధులు, ఆయుధాల వినియోగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పనితీరు, ఫింగర్‌ప్రింట్ వ్యవస్థ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పనితీరును అధికారులు వివరించారు. ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9 ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను ప్రదర్శించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు.సాంకేతిక పరికరాల పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

*** మహమ్మద్ అజారుద్దీన్.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బం దులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించేం దుకు రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చే యాలని ఆవాజ్ జిల్లా కమిటీ కార్యదర్శి మహమ్మద్ అజారుద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరా ల అధికారి సురేష్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతోంద ని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ స్యపై ప్రత్యేక దృష్టి సారించి రేషన్ దుకా ణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే మార్కెట్ లో సరుకుల ధరలను నియంత్రించి సా మాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించే లా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాజా మీర్ మోహినో ద్దీన్ పాల్గొని, ప్రభుత్వం తక్షణమే స్పం దించి ప్రజలకు ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు

: ఎస్సై కె.కిషోర్



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం చీటూరు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, ట్రాక్టర్ యజమానులతో ఎస్ఐ కె.కిషోర్ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా చీటూరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుం డా అక్రమంగా ఇసుక తవ్వడం,రవాణా చేయడం చట్టరీత్యానేరమని స్పష్టం చే శారు. నిబంధనలకు విరుద్ధంగా అను మతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఇసుక అక్ర మ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒ క్కరూ నిబంధనలు పాటించాలని ఎస్. ఐ కె.కిషోర్ సూచించారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

*** ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి**

*** కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి,భైంసా :గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటికి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కుభీర్ మండలంలోని పార్డి (బి), హల్దా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.ముందుగా పార్డి (బి) గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం హల్దా గ్రామంలో రైతులతో సమావేశమైన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. భూములకు సంబంధించిన వివరాలను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సీలింగ్ భూముల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీదేవి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో


భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు



ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచనల మేరకు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధులు, నేరాల నియంత్రణ, నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల భద్రత కోసం పోలీసులు ఉపయోగించే పరికరాలు, వివిధ విభాగాల విధులపై అవగాహన కల్పించారు.పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యలు, ప్రజలకు అందించే పోలీస్ సేవలు, పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు స్పందించే విధానం,ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో వ్యవహరించే తీరు, ప్రజలు పోలీసులకు అందించాల్సిన సహకారం గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖలోని ఐటీ సెల్, బాంబ్ డిస్పోజల్ టీం (టీం), సైబర్ క్రైమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్, జిల్లా నేర రికార్డుల విభాగం స్పెషల్ బ్రాంచ్ , డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును విద్యార్థులకు వివరించారు. ఐటీ సెల్ ద్వారా పోలీస్ శాఖలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటల్ సేవలు, సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత, నేరాల గుర్తింపులో సాంకేతిక ఆధారాల పాత్రను తెలియజేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వెల్లడించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.ఫింగర్ ప్రింట్స్ విభాగం ద్వారా నేరస్థలాల్లో వేలిముద్రల సేకరణ, విశ్లేషణ, నేరస్థులను గుర్తించడంలో వాటి ప్రాధాన్యతను వివరించారు. కమ్యూనికేషన్ విభాగం ద్వారా వైర్‌లెస్ వ్యవస్థ, అత్యవసర సమయాల్లో పోలీస్ సిబ్బంది మధ్య సమాచార మార్పిడి, వివిధ విభాగాల సమన్వయం గురించి తెలియజేశారు. పోలీస్ అమరవీరులు దేశం కోసం, ప్రజల రక్షణ కోసం చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీస్ఫూర్తిదాయకమని, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, చట్టాల పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన పెంపొందడంతో పాటు పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్పీ సీఐ నాగరాజు, 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, 2 టౌన్ ఎస్.ఐ సైదా బాబు,ఆర్ఐ సంతోష్‌తో పాటు ఐటీ సెల్, బాంబ్ డిస్పోజల్ టీం, సైబర్ క్రైమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్, డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, డాగ్ స్క్వాడ్ విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు,జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై గండ్ర విస్తృత ప్రచారం

*** నవంబరు 6లోగా అర్హులైన పట్టభద్రులు నమోదు చేసుకోవాలి**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విస్తృతంగా అవగాహన కల్పించారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించి, జీఎంతో పాటు ఉద్యోగులను కలిశారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. నవంబరు 6 వరకు గడువు ఉన్నందున చివరి తేదీ కోసం వేచి చూడకుండా వీలైనంత త్వరగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఇందులో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్లను కలిసి ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరించారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు కృష్ణ కాలనీ, 7వ వార్డు, 24వ వార్డు కార్ల్ మార్క్స్ కాలనీ, 26వ వార్డు టీ2 క్వార్టర్స్‌లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు.భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు సుమారు ఐదు వేల మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే నమోదైనట్లు సమాచారం ఉందని, గతంతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువగా ఉందని గండ్ర పేర్కొన్నారు. మరింత మంది పట్టభద్రులు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

*** డీఆర్వో పద్మావతి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో జనవరి 1 నుంచి అక్టోబర్ 15 వరకు మొత్తం 410 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 179 ప్రాణాంతక ప్రమాదాలు కాగా, 231 ప్రాణాపాయం లేని ప్రమాదాలుగా నమోదైనట్లు వివరించారు. ఈ ప్రమాదాల్లో 191 మంది ప్రాణాలు కోల్పోగా, 26 మంది తీవ్రంగా, 383 మంది స్వల్పంగా గాయపడ్డారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన డీఆర్వో, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర మలుపులు, కూడళ్లు, రహదారులపై ఉన్న ఇతర సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. రహదారుల భద్రతకు సంబంధించిన పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి. బాలాజీ, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు ,డీఎస్పీ వెంకన్న బాబు, జిల్లా వైద్య శాఖ అధికారులు, ఆర్అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

నవ వరుడి విషాదాంతం

*** సందీప్ భౌతికాయానికి నివాళులర్పించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మండలం, అర్పణపల్లి గ్రామానికి చెందిన సందీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదం నింపింది.గురువారం రాత్రి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఉప్పరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ప్రమాదంలో ఆయన భార్య భవాని తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం హాస్పిటల్ లో చికిత్స పొందుతోంది. సందీప్ కు వివాహమై కేవలం రెండు నెలలే కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శుక్రవారం సందీప్ అంత్యక్రియలు జరిగాయి.మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సందీప్ నివాసానికి చేరుకుని, భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియలలో మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ పాల్గొని పాడె మోశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సందీప్ మరణం కుటుంబానికి తీరని లోటని,తక్కువ సమయంలోనే అందరి మన్ననలు పొందాడని ఆవేదన వ్యక్తం చేశారు.సందీప్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి,మాజీ పిఏసిఎస్ చైర్మన్ బండారు వెంకన్న,సర్పంచ్ కుమారస్వామి,చిన్న వెంకన్న,వల్లందాసు రవి,తరాల వీరేష్, కమకుటం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్, తండ సంపత్,బీర్రు వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 49 వాహనాలకు జరిమానాలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు.గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తోపాటు పోలీసు అధికారులు, సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాణాపూర్ తండాలో ఫైనాన్షియల్ సాచురేషన్ అవగాహన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి,భైంసా :దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలనే ప్రధాన లక్ష్యంతో చేపట్టిన దేశవ్యాప్త ముమ్మర ఫైనాన్షియల్ సాచురేషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం, నిర్మల్ గ్రామీణ మండలంలోని రాణాపూర్ తండాలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అవగాహనపై దిశానిర్దేశం చేశారు. సాధారణ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకింగ్ వ్యవస్థ కల్పిస్తున్న సౌకర్యాలు, పొదుపు పథకాలు, డిజిటల్ ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వారు సమగ్రంగా వివరించారు. రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం వల్ల ఆర్థిక భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ బ్యాంకింగ్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా అధికారుల బృందం క్షుణ్ణంగా వివరించింది. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం రాములు, శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, గ్రామ సర్పంచ్ నెహ్రూ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామచంద్రస్వామి దేవస్థానంలో అష్టపులిహోర వేలం, కోటేషన్లు

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని లింగాలఘణపురం మండలం జీడికల్ గ్రామంలోని శ్రీ రామచంద్రస్వామి దేవ స్థానంలో 29 వ తేదీన ఉదయం 11గం టలకు హుండీ విప్పుట, మధ్యాహ్నం 12.30 గంటలకు అష్టపులిహోర ఫల హారాల వేలం నిర్వహించనున్నట్లు దేవ స్థాన కార్యనిర్వహణ అధికారి చిందం వంశీ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తె లిపారు. అలాగే 2026 సంవత్సరానికి సంబంధించిన బ్రహ్మోత్సవాల నిర్వహ ణలో భాగంగా వివిధ పనులకు సంబం ధించి మధ్యా హ్నం 1 గంటకు కోటేషన్ల ప్రక్రి య చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఆ సక్తి గలవారు నిర్ణీత సమ యానికి హాజ రుకావాలని వారు సూచించారు.

ఖమ్మం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

*** ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న**



పాలేరు, ప్రజా స్ఫూర్తి: భారతదేశంలో రుతుపవనాల పై ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపుతుంది.ఎల్ నినో ఉన్న సంవత్సరాల్లో భారతదేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది, దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు లేదా తీవ్రమైన ఎండలు ఏర్పడతాయి. ఎల్ నినో ముప్పుపై కొంతకాలం నుండి వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ, ప్రభుత్వం ,జిల్లాలో సాధారణం కంటే తక్కువ శాతం వర్షపాతం నమోదైనట్లు నివేదికలు ఉన్నాయి.పరిస్థితులు వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రజల జీవనానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, భూగర్భ జలాలు అడుగంటకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం , క్షేత్రస్థాయిలో రైతులకు,వ్యవసాయ కూలీలకు,హమాలిరంగ కార్మికులకు భవన నిర్మాణ రంగా కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించడం లేదు.వర్షాభావ పరిస్థితులు ముందే కనిపిస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది రైతన్నానికి 24 గంటలు కరెంటు అన్నారు, నేడు 8 గంటల కూడా ఇవ్వటం లేదు అందులో కూడా పది నిమిషాలకి పది నిమిషాలు కరెంటు కట్టు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి నెలకొని ఉంది వ్యవసాయం ప్రధానంగా వర్షాలు,భూగర్భ జలాలు, సాగునీటి వనరులపై ఆధారపడి ఉంది. వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాల మట్టాలు పడిపోవడం, సాగునీటి లభ్యతపై అనిశ్చితి ఏర్పడటం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేసి నష్టపోతే వారి కుటుంబాలు మరింతగా ఆర్థికంగా ,నష్టపోతారు వ్యవసాయంపై ఆధారపడిన కూలీలకు రైతులు పండించే పంటను ఎగుమతి దిగుమతి చేసే హమాలీ కార్మికులు వ్యవసాయ మార్కెట్లో పనిచేసే కార్మికులు ఎరువుల దుకాణాలలో పనిచేసే కార్మికులు కూరగాయ మార్కెట్లో పనిచేసే కార్మికులు ,రైతులను నమ్ముకునే భవనాలు నిర్మించే కార్మికులకు ,ఉపాధి కరువవుతుంది. వ్యవసాయ రంగా రైతంగంపై ఎంత మంది జీవితాలు ఎంతమంది జీవన అభివృద్ధి ఆధారపడి ఉందో అర్థమవుతుంది,గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది,అంచనా వేసి తగిన పరిహారం అందించాలి.చెరువుల కుంటలని, సాగర్, గోదావరి జలాలతో నింపాలని కోరుతున్నాం,రబీ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ద్వారా గ్రామస్థాయిలో శాస్త్రీయ అవగాహన కల్పించి, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి.

*** చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులో రుణాలు మాఫీ చేయాలి..**

రైతులు, వ్యవసాయ కూలీలు, తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులో రుణాలు మాఫీ చేయాలి వ్యవసాయ రంగానికి సంబంధించిన నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలి రైతాంగానికి కొత్త రుణాలు ప్రత్యేక సహాయం అందించాలి. కరువు ప్రభావంతో పంటలు దెబ్బతిని అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి రాకుండా రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకన్న ఒక ప్రకటనలలో తెలిపారు.

తపాలపూర్ గ్రామంలో కుష్టి వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ ఆదేశానుసారం శుక్రవారం తపాలాపూర్ గ్రామంలో కుష్టి వ్యాధి నిర్ధారణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ మాట్లాడుతూ తమ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తిని చర్మంపై తెలుపు ఎరుపు లేదా రాగి రంగు మచ్చలు ఉండి మచ్చలపై స్పర్శ లేకపోవడం చేతులు కాళ్లు తెమ్మిర్లు ముద్దువారిపోవడం మచ్చపై చెమట పట్టకపోవడం వెంట్రుకలు రాలిపోవడం నరాలు లావుగా అవ్వడం వంటి లక్షణాలు ఉన్నాయ లేవా అని గుర్తించి కుష్టి వ్యాధి పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కుష్టి వ్యాధి పూర్తిగా నయమవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారించి ఏం డి టి మందులు ఉచితంగా ఇస్తారని ముందుగా వ్యాధిని గుర్తిస్తే, వేళ్ళు వంగిపోవడం ముక్కు చదును అవడం కాలి పుండ్లు ,అంగవైకల్యం నుండి కాపాడుకోవచ్చని, ఈ ఎల్పిడిసి కార్యక్రమం 22 అక్టోబర్ నుండి 4 నవంబర్ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ప్రతి ఒక్కరూ కూడా వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త లలిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు వేయాలి

*** మండల సర్వసభ్య సమావేశంలో ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి:హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కొండల్ రెడ్డి సమక్షంలో గ్రామపంచాయతీ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఎల్ నినో వాతావరణ పరిస్థితుల దృశ్య గ్రామాలలో మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని రాబోయే కాలంలో నీటి తీవ్రత ఎక్కువగా ఉండే ప్రభావం ఉంది కాబట్టి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను అవగాహన కల్పించే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొండల్ రెడ్డి సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆత్మకమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వాంకుడోతు సురేష్ ,సర్పంచులు కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

విద్య, పరిశుభ్రత, భోజన నాణ్యతపై కలెక్టర్ ఫోకస్

*** తరిగొప్పుల పాఠశాలలో సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ**



జనగామ, (ప్రజాస్ఫూర్తి): పాఠశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం తరిగొప్పుల మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, బోధన, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆంగ్ల పఠన సామర్థ్యాలను తెలుసుకుని, మెరుగైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ తనిఖీలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు... అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి

*** డీఎంహెచ్ఓ రవి రాథోడ్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ పీహెచ్ సీ వైద్యాధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్ సీ వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమ్మె కాలంలో ఓపీ సేవలు, టీకాల కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు.జిల్లాలో జరుగుతున్న కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేలో భాగంగా, అనుమానాస్పద మచ్చలను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందించాలని తెలిపారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా పరీక్షలు,టీకాలు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు.తలసేమియా, మలేరియా, డెంగ్యూ, క్షయ, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మహిళల్లో గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పించి, అనుమానిత కేసులను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ నాగేశ్వరరావు,డాక్టర్ అర్జున్,డాక్టర్ శివకుమార్,డాక్టర్ శ్రావణ్,డాక్టర్ విరాజిత తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలే లాభదాయకం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు బోర్లు,బావుల కింద ఆదాయం ఇచ్చే ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు.శుక్రవారం పెద్దవంగర మండలం,అవుతాపురం రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు.మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్,కోకో,కొబ్బరి, కూరగాయలు,పండ్ల తోటలు, పూలు, మల్బరీ వంటి పంటలు సాగు చేయాలని తెలిపారు.అనంతరం వాంకుడోతు చిలుకమ్మ,బానోతు శ్రీనివాస్ క్షేత్రాలను సందర్శించారు. ఖమ్మం జిల్లా రైతుల నుంచి తెలుసుకొని గత పదేళ్లుగా కూరగాయలు, పుచ్చ,కర్బూజ,బొప్పాయి సాగు చేస్తూ,ఎకరాకు ఖర్చులు పోను రూ. 2 లక్షల ఆదాయం పొందుతున్నామని రైతులు తెలిపారు.ఎల్ నినో నేపథ్యంలో పశువులకు శుభ్రమైన తాగునీరు,తగినంత మేత,నీడ అందించాలని, ఎండు మేత,సైలేజ్ ను ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారి మధుసూదన రాజు, వ్యవసాయ అధికారి విజయచంద్ర, ఉద్యానవన అధికారి జినుగు మరియన్న, పశుసంవర్ధక అధికారి కిరణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి బ్యాంక్ అకౌంట్ ఎంత అవసరమో పాలసీ అంతే అవసరం

ఎస్బిఐ మేనేజర్ సయ్యద్ నబి



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి : ప్రతి వ్యక్తికి బ్యాంక్ అకౌంట్ ఎంత అవసరమో పాలసీ అంతే అవసరం అని గరిడేపల్లి శాఖ ఎస్బిఐ మేనేజర్ సయ్యద్ నబి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో హుజూర్ నగర్ సిఎఫ్ఎల్ పల్లి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జన సురక్ష ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కేవలం 20 రూపాయలు చెల్లించి ప్రమాద బీమా కింద 2లక్షలు పొందవచ్చునని అన్నారు. ప్రధాన మంత్రి సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ప్రతి నెల మీకు తోచినంత ఆడపిల్ల పేరు మీద వేస్తే అవి వివాహ సమయంలో అవసరానికి వస్తాయని అన్నారు. ఇందులో భాగంగా అప్పన్నపేట గ్రామ సర్పంచ్ నందిపాటి కవిత జానయ్య లు తమ గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇన్సూరెన్స్ చూపించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యరగొర్ల మదార్ ,పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ , ఎర్రెడ్ల సునీత,గ్రామ ప్రజలు శ్రీనివాస్, నర్సిరెడ్డి,బిక్షం,సతీష్ బాల సైదులు,సైదులు, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి సీపీఎం డిమాండ్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండల కేంద్రంలో (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.తక్షణమే సర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని కోరారు. ఎన్నికల కమిషన్ లో ముగ్గురు సభ్యులున్నప్పటికీ ఆయన ఒక్కరే నిర్ణయాలు తీసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని అన్నారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దోసపాటి బిక్షం, రాయరాల శ్రీనివాస్, నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, బి. శ్రీనివాస్, పందిరి వీరారెడ్డి, గుండెబోయిన సైదులు, మార్కపూడి వీరస్వామి, ఎలావల నారాయణ, జిలకర పెంటయ్య, సారెడ్డి సైదిరెడ్డి, బాలయ్య, ఎస్.కె. నాగులు, ఎల్. సంతోష్, కందుకూరి శ్రీనివాస్, బొడ్డుపల్లి బిక్షం, పోలేపల్లి వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా అలయ్ –బలయ్ కార్యక్రమానికి అందోలు నాయకులు



అందోలు, ప్రజాస్ఫూర్తి : విజయదశమి సందర్భంగా చౌటకూరు మండలంలోని ఎంఎస్ గార్డెన్‌లో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ నిర్వహించిన అలయ్ -బలయ్ కార్యక్రమానికి అందోలు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. మొదటి సారిగా మండల పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు 25 కార్లలో ర్యాలీగా తరలివెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారుగా 200 మంది కార్యకర్తలు, నాయకులు ఒకేసారి కార్యక్రమానికి చేరుకోవడం చర్చనీయాంశమైంది. మండల కాంగ్రెస్ నాయకుడు జీఆర్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులంతా ఏకం కావడం విశేషం. మంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జీఆర్. మధుసూధన్‌రెడ్డి, రమేశ్, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

అనాథ చిన్నారుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

*** డీఎల్ఎస్ఏ కార్యదర్శి స్వాతి మురారి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:స్థానిక దైవ కృప అనాథ ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని వసతి గదులు, వంటశాల, తాగునీటి సదుపాయాలు, డైనింగ్ హాల్, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. నిల్వ ఉంచిన ఆహార ధాన్యాల నాణ్యతను పరిశీలించి, చిన్నారులకు మెనూ ప్రకారం సమతుల్య పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి, వారి చదువులు, విద్యా సామగ్రి, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనాథ చిన్నారులకు గౌరవప్రదమైన భవిష్యత్తు అందించడం అందరి బాధ్యతని,వారికి నాణ్యమైన విద్య, సురక్షిత ఆశ్రయం కల్పించాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

బి జి ఆర్ ఎ ఎం జి పథకం కింద చేపడుతున్న పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గుండాల మండలం పాచిల్ల గ్రామంలోని కట్ట మైసమ్మ కుంట వద్ద వి బి జి ఆర్ ఎ ఎం జి పథకం కింద చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న 52 మంది కూలీలతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి, వారికి కల్పిస్తున్న పనులు, రోజువారీ వేతనాలు, పని దినాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో గ్రామీణ కుటుంబాలు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామీణ కుటుంబం సంవత్సరానికి అందుబాటులో ఉన్న 125 రోజుల పని అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, రోజుకు రూ.308 వేతనం పొందేలా నిర్దేశించిన పనులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించేలా అవసరమైన పనులను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, ఎంపిడిఓ చండీ రాణి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్వెల్లిలో ఎస్ఓటీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడులు

*** ఏ1 బ్రాండ్ అల్లం–వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంలో 72 కిలోల కుళ్లిన ముడి పదార్థాలు గుర్తింపు**



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ జీహెచ్ఎంసీ పరిధిలోని అత్వెల్లి గ్రామంలో ఏ1 బ్రాండ్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై శుక్రవారం ఉదయం ఎస్ఓటీ, టీజీసీఎఫ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 22 కిలోల కుళ్లిన వెల్లుల్లి, 50 కిలోల అల్లం కలిపి మొత్తం 72 కిలోల ముడి పదార్థాన్ని గుర్తించినట్లు మేడ్చల్-కుత్బుల్లాపూర్ జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టిన అధికారులు, ముడి పదార్థాల నాణ్యత, తయారీ కేంద్రంలోని పరిశుభ్రతను పరిశీలించారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న అల్లం-వెల్లుల్లి పేస్ట్ నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాల పరీక్షల ఫలితాలపై వివరాలు వెల్లడికావాల్సి ఉంది.ఆహార పదార్థాల తయారీకి అవసరమైన లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని, పరిశుభ్రమైన ప్రదేశాల్లోనే ఉత్పత్తులు తయారు చేయాలని అధికారులు సూచించారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆహార నాణ్యతపై ఫిర్యాదు చేయండి

పాలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్‌తో పాటు ఇతర ఆహార పదార్థాల నాణ్యతపై అనుమానాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 9100105795కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ తెలిపారు.

విద్యార్థుల్లో సంఖ్యా పరిజ్ఞానం పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో, అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు.శనివారం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అయిన ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జానీ అఫ్గాన్, ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ లో సీటు సాధించిన అజ్మీరా వెన్నెలకు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలంలోని రూప్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా వెన్నెల ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించారు. వెన్నెల భూక్యా రమేష్ నాయక్ - సునీత లా మేనకోడలు, స్వర్గీయ అజ్మీరా పున్నం చంద్ - రవిత ల కుమార్తె అయిన అజ్మీరా వెన్నెల ఎంబీబీఎస్ సాధించిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సాయికిరణ్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ వెన్నెల ఎంబిబిఎస్ సీటు సాధించడం అనేది, తనకే కాకుండా తన గ్రామ తాండకు కూడా ఎంతో గర్వకారణం అని,ఆమె సాధించిన ఈ విజయం తండా ప్రజలకు, యువతకు స్ఫూర్తిదాయకం. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వెన్నెల నిరూపించారని అన్నారు. వైద్య విద్యలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, పేద ప్రజలకు సేవలందిస్తూ మంచి వైద్యురాలిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అజ్మీరా వెన్నెలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా ప్రజలు తమ బంధువులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: జిల్లా రైతాంగం ఆరుతడి పంటల సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంట పొలాలు ఎండి పోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నీ నో పై అప్రమత్తంగా ఉండాలని,జిల్లా రైతాంగం వచ్చే రబి సీజన్ కోసం ఆరుతడి పంటల వైపు దృష్టిసారించి, నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఎల్ నీ నో ప్రభావం పై అప్రమత్తత కోసం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,వ్యవసాయ , ఉద్యానవన శాఖ అధికారులు ప్యాట చిన్న చింతకుంట సర్పంచ్ సరిత మహేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

*** మహిళా సంఘాల ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు.**



లింగాల ఘణపురం/ జనగామ, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొను గోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా లోని లింగాల ఘణపురం మండలం మాణిక్యపురం గ్రామంలో ఐకేపీ మహి ళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సర్పం చ్ చౌదరపల్లి విజయభాస్కర్ ప్రారం భించారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్ర మహేశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు చౌదరి పల్లి రోశయ్య, చౌదరి పల్లి పద్మ,బడికేకనుకలక్ష్మి,బుగ్గ పృథ్వీ రాజ్,వడగం లక్ష్మణ్,చాపల కనకలక్ష్మి, మైల స్వాతి, మహిళా సంఘం అధ్యక్షు రాలు చాపల లావణ్య, మరికుక్కల సుజాత,వీఓఏ వడగం శ్రీలత, సీసీ కవిత తోపాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఈ కొను గోలు కేంద్రం ద్వారా రైతులకు ధాన్యం విక్రయించేం దుకు సౌకర్యం కల్పించడం తోపాటు, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకా రం కొనుగోళ్లు నిర్వహించనున్నారు.

చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్




భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గుండాల మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సహకార సంఘం వర్క్‌షెడ్‌లో పనిచేస్తున్న చేనేత కార్మికులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వస్త్రాల తయారీలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఉత్పత్తుల విక్రయాలు,మార్కెట్‌లో చేనేత వస్త్రాలకు ఉన్న డిమాండ్, మార్కెటింగ్ సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. చేనేత కార్మికులు తయారు చేస్తున్న వివిధ రకాల వస్త్రాలను, వాటి తయారీ విధానాన్ని పరిశీలించారు.చేనేత కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా చర్చించారు. చేనేత ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా కార్మికులకు మరింత ఆదాయం లభించేలా కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, గుండాల ఎంపీడీవో, గుండాల తహసీల్దార్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చిన్నం ప్రకాష్, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య గుడి వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు

*** మంత్రి పొంగులేటి చొరవతో పనులు పూర్తి**

*** కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు మంకెన శ్రీనివాసరావు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: అయ్యప్ప భక్తుల పూజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముత్యాలగూడెం గ్రామంలోని కాటమయ్య గుడి వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను సత్వరమే పూర్తి చేసిన విద్యుత్ అధికారులను గ్రామ ప్రజలు అభినందించారు. గుడి వద్ద విద్యుత్ సదుపాయం లేకపోవడంతో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. గుడి వద్ద విద్యుత్ సదుపాయం కల్పించేందుకు సుమారు అర కిలోమీటరు మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వైర్లు లాగి వీధిదీపాలను అమర్చారు. భక్తులకు అవసరమైన సదుపాయాన్ని కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు వేగంగా స్పందించి పనులను పూర్తి చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు, చొరవతో పాటు మంత్రి పీఏ తంబూరి దయాకర్ రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో విద్యుత్ పనులు వేగంగా పూర్తయ్యాయని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు.ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం వల్లే ఈ సదుపాయం త్వరగా అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు.

*** విద్యుత్ అధికారులకు అభినందనలు**

కాటమయ్య గుడి వద్ద విద్యుత్ సదుపాయం కల్పించడంలో చొరవ చూపి, పనులను సత్వరమే పూర్తి చేసిన ఏడీఈ వెంకట్, ఏఈ మహమ్మద్ అక్బరుద్దీన్, జేఎల్ఎం ఎం. శ్యామ్‌లను కాంగ్రెస్‌పార్టీఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు మంకెన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పేరెల్లి అశోక్, ఉపసర్పంచ్ పాసిని ప్రభాకర్, అయ్యప్ప భక్తులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

సరాకా ల్యాబోరేటరీ పరిశ్రమ నిర్లక్ష్యం

*** గ్యాస్ లీక్,ఇద్దరు కార్మికులు మృతి**

- ఏడుగురికి అస్వస్థత

- మృతులకు రూ 70 లక్షల పరిహారం : ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- బ్రిగ్భాంతి వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీష్ రావు





సంగారెడ్డి (జిన్నారం),ప్రజాస్ఫూర్తి: సరాకా ల్యాబొరేటరీ పరిశ్రమ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు కార్మికులు మృతిచెందగా మరో ఏడు మంది కార్మికులు క్షతగాత్రులుగా మిగిలారు. భద్రత పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించడం వలన గ్యాస్ లీకేజీ కావడంతో ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చోటుచేసుకుంది. బాధితులు స్థానికుల కథనం ప్రకారం గడ్డపోతారం శివారులో ఉన్న సరాక పరిశ్రమ ప్రొడక్షన్ యూనిట్ 2లో గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో అకస్మాత్తుగా క్లోరోఫామ్ గ్యాస్ లీకేజీ అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం బసివాడ గ్రామానికి చెందిన పంగ సుదర్శన్ రావు (44), విజయనగరం జిల్లా పెద్ద మాజీ పాలెం గుడియాడ గ్రామానికి చెందిన కిలపర్తి బాలాజీ (29) ఊపిరాడక మృతి చెందారు. దగ్గర్లో పనిచేస్తున్న సూపర్వైజర్లు వాసిరెడ్డి, నిమ్మ గణేష్, ఆపరేటర్ గోక రాంప్రసాద్, హెల్పర్లు రవితోన్, అన్వేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, పొంచిరెడ్డి యుగంధర్ రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్యాస్ పైప్ లైన్ నిర్వహణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఉండడం వల్లే గ్యాస్ లీకేజీ జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి హరీష్ రావు సానుభూతిని తెలియజేశారు. రాష్ట్రంలో రసాయన పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గతంలో పాషమైలారం పారిశ్రామిక వాడలోని శిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం మర్చిపోకముందే గడ్డపోతారం సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజ్ తో కార్మికుల మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలతో, చికిత్స పొందుతున్న వారికి పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

*** మృతులకు రూ.70 లక్షల పరిహారం**

గడ్డపోతారం పారిశ్రామికవాడలో గ్యాస్ లీకై కార్మికుల మృతి చెందారు అన్న విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ప్రమాద పరిస్థితులను తెలుసుకొని మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం రూ.70 లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించింది. పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు భద్రత చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణ నష్టం జరగకుండా పరిశ్రమల యాజమాన్యాలు నిరంతరం భద్రత పెంచాలని సూచించారు. సరాక పరిశ్రమ లో గ్యాస్ లీకేజీకి కారణాలను తెలుసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొల్లు మహీధర్ , సాత్విక ను అభినందించిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టుల ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రదర్శించిన స్మార్ట్ స్టీరింగ్ విత్ హెల్త్ ఎలర్ట్స్ టు రెడ్యూస్ ది యాక్సిడెంట్స్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరిచి విజయం సాధించిన ఎం ఎస్ ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి కొల్లు మహీధర్ ను , సిబిఎస్ ఇ జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ 600 మీటర్ పరుగు పందెం లో స్వర్ణం సాధించిన ఎంఎస్ ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని కుమారి సాత్విక ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అభినందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రావు , జిల్లా సైన్స్ అధికారి దేవ రాజు, మరియు సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో సాగయ్యే పంటలే వేయాలి..

*** రైతులకు అవగాహన కార్యక్రమంలో అధికారులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: తక్కువ నీటితో సాగయ్యే పంటలే యాసంగిలో రైతులు సాగు చేయాలని మండల అధికారులు సూచించారు. శుక్రవారం చేగొమ్మ రైతు వేదికలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కేత్ బచావో అభియాన్ పథకం ద్వారా రైతులకు భూ సంరక్షణ, నేలను మెరుగుపరచడం, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం, పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా కలిగే అనర్థాలు, ప్రకృతి వ్యవసాయం మొదలగు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. అదే విధంగా విత్తన మొక్కజొన్న వేసే రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీ నుండి అగ్రిమెంట్ తీసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం యాసంగిలో రైతులు ఎల్నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని వరి, మొక్కజొన్న వంటి పంటలు వేయవద్దని , తక్కువ నీటిని వినియోగించుకునే పెసర ,మినుము, వేరుశనగ, జొన్న వంటి పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సైదులు , చేగొమ్మ ముత్యాలగూడెం గ్రామ సర్పంచులు, ఏఈఓ రవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చేగోమ్మ గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన సదస్సు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో చేపట్టిన భూ సర్వే రీ సర్వేలో భాగంగా చేగోమ్మ గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని తహసీల్దార్ డి సైదులు తెలిపారు.శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో భాగంగా రైతులు వారి పట్టా పాస్ పుస్తకం, భూమికి సంబంధించిన ఆధారాలు, ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకొని, వారి ప్రదేశంపై హాజరై వారి భూమి హద్దులు అందరి సమక్షంలో చూపించి సర్వే చేయించుకోవలసినదిగా సంబంధిత గ్రామ రైతులకు తెలియచేశారు. ఇట్టి కార్యక్రమంలో తహశీల్దార్ డి సైదులు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఆర్.వాణి, మండల గిర్దవార్ , సర్వేయర్, జిపిఓ లు, చేగోమ్మ, ముత్యాల గూడెం గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం అవగాహన..

అనంతరం వరంగల్ ఖమ్మం నల్లగొండ శాసన మండలి (ఎం ఎల్ సి) పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడానికి అర్హులైన పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని తహసీల్దార్ తెలిపారు. ఇట్టి సమావేశం నందు తహశీల్దార్ డి. సైదులు, మండల గిర్దవార్ రాము, జీ పీ ఓ లు,పంచాయతీ సెక్రటరీలు, బీ ఎల్ ఓ లు పాల్గొన్నారు.

MOVIE TIME

ప్రభాస్ బర్త్‌డే స్పెషల్
ఫ్యాన్స్‌కు ట్రిపుల్ ధమాకా

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా కల్కి 2 నుంచి మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు. సలార్ 2ను అఫీషియల్‌గా ప్రకటించారు. ఇవే కాకుండా ఫౌజీ నుంచి ఓ స్పెషల్ పోస్టర్‌ను కూడా మేకర్స్ అభిమానులతో పంచుకున్నారు. ఈ మూడు అప్‌డేట్స్ తాలూకు ఫొటోలు, వీడియోలు రెబెల్ స్టార్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం–లో రూపొందుతోన్న మూవీ కల్కి 2 . సైన్స్‌ఫిక్షన్ యాక్షన్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో విలక్షణ నటుడు కమల్‌హాసన్ విలన్‌గా నటిస్తోన్నారు. అమితాబ్‌బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ సినిమా నుంచి ఆయన పాత్రకు సంబంధించిన భైరవ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో డ్రాగన్ సినిమా చేస్తున్న ప్రశాంత్ నీల్ ఈ మూవీ పూర్తయిన తర్వాత సలార్ 2 ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టబోతున్నట్లు ప్రకటించారు.





లేడీ ఓరియెంటెడ్ కథలో..
రుక్మిణి వసంత్

హిట్టు కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న కన్నడ బ్యూటీరుక్మిణి వసంత్ తన రూటు మార్చింది. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో ఓ సినిమా చేయబోతుంది. ఒకే ఒక జీవితం ఫేమ్ శ్రీ కార్తిక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శుక్రవారం అఫీషియల్‌గా అనౌన్స్‌చేశారు. రోడ్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో తార అనే పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించబోతుంది. రోడ్ ట్రిప్ నేపథ్యంలో అడ్వెంచరస్ కామెడీగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో దేవ్ రామ్‌నాథ్, వినయ్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. త్వరలోనే టైటిల్‌తో షూటింగ్ వివరాలను వెల్లడించబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



డిసెంబర్ 11న థియేటర్లలోకి
ఇడుపు కాయితం

ప్రియదర్శి, ఫోక్ సింగర్ నాగదుర్గ హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఇడుపుకాయితం మూవీ రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. డిసెంబర్ 11న ఈ తెలంగాణ మూవీ థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమా నుంచి ఏ ఇంటి కోయిలవో నువ్వు అనే పాటను శుక్రవారం రిలీజ్ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ సతీమణి తబితతో కలిసి నిర్మాత బన్నీవాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇడుపు కాయితం మూవీపై టైటిల్‌తోనే మంచి బజ్ ఏర్పడింది. ఈ పేరు ట్రోల్ చేస్తూ కొందరు పెట్టిన పోస్ట్‌లు, ట్వీట్స్‌పై తెలంగాణ వాదాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు ఇవే

నెట్‌ఫ్లిక్స్:	ది ప్యారడైజ్ (తెలుగు) డోరతీ (తమిళ్) ధూమకేతు (మలయాళం) మటర్ గస్తీ వెబ్‌సిరీస్ (హిందీ) ది లాస్ట్ హౌజ్ ఆన్ ది లెఫ్ట్ (ఇంగ్లీష్)
ఆహా వీడియో:	నా వైఫ్ మిస్సింగ్ (తెలుగు)
జీ5 ఓటీటీ:	అయ్యనమానే 2 వెబ్‌సిరీస్ (కన్నడ) సట్టమామ్‌నీదియుమ్ (తమిళం) సుమోదీదీ (హిందీ) ది ఇన్వైట్ (ఇంగ్లీష్)
ఈటీవీ విన్ ఓటీటీ:	ఫ్లైట్ మహా (తెలుగు)
జియో హాట్ స్టార్:	వరం వెబ్‌సిరీస్ (తెలుగు)

తల్లైన నెల రోజులకే కెమెరా ముందుకు

గత నెలలో మాతృత్వ బంధంలోకి అడుగుపెట్టింది దీపికా పడుకోణ్. రెండోసారి రణవీర్, దీపికా దంపతులకు కూతురు పుట్టింది. చిన్నారికి దేవీ పడుకోణ్ సింగ్ అనే పేరు పెట్టినట్లు దసరా సందర్భంగా ఈ బాలీవుడ్ జోడీ ప్రకటించారు. తల్లిగా మారడంతో దీపికా పడుకోణ్ సినిమాలకు ఐదారు నెలల పాటు బ్రేక్ ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది ఈ బాలీవుడ్ బ్యూటీ తిరిగి రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉన్నట్లు వార్తలొచ్చాయి. ఈ రూమర్లకు తెరదించుతూ నెల రోజుల్లోనే తిరిగి కెమెరా ముందుకు రాబోతుంది దీపికా పడుకోణ్. షారుఖ్‌ఖాన్ హీరోగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందుతోన్నబాలీవుడ్ మూవీ కింగ్ షూటింగ్‌లో జాయిన్ అవుతోంది. తల్లిగా మారిన నెలరోజుల్లోనే దీపికా పడుకోణ్ తిరిగి షూటింగ్‌లలో పాల్గొననుండటంపై బాలీవుడ్ వర్గాలతో పాటు నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. వృత్తి పట్ల ఆమెకు ఉన్న అంకితభావానికి నిదర్శనమిదని అంటున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.